క్లుప్తంగా

మంత్రి పొన్నంను విమర్శిస్తే సహించేది లేదు

హుజూరాబాద్‌రూరల్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ శనివారం హెచ్చరించారు. ఉనికి చాటుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే మీడియా ఎదుట పొన్నంపై తప్పుడు వ్యాఖ్యలు చేయటం దిగజారుడు రాజకీయాలకు అద్దం పడుతోందన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన గొప్ప నాయకుడు పొన్నం అని, పార్టీ నమ్ముకున్న గొప్ప నేత అని పేర్కొన్నారు.

కల్వర్టుల పైపులు తరలింపు

శంకరపట్నం: అర్కండ్ల గ్రామంలోని సింగిల్ రోడ్‌లో ఉన్న కల్వర్టు పైపులను పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తి శనివారం ఇతర ప్రాంతానికి తరలించాడు. అర్కండ్ల, వీణవంక మండలం గంగారం గ్రామాల మధ్య ఉన్న సింగిల్ రోడ్‌కు గతంలో కల్వర్టులున్నాయి. కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి వీణవంక మండలం చల్లూరు వరకు కేంద్ర ప్రభుత్వం నిధులతో డబుల్ రోడ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కల్వర్టులున్న ప్రాంతంలో గతంలో ఉన్న పైపులను తొలగించి మళ్లీ నూతనంగా కల్వర్టులు నిర్మిస్తున్నారు. గతంలో పైపులను గ్రామానికి చెందిన వాగు నీరు ప్రవహించే ప్రాంతాల్లో పంట పొలాలకు వేయాలని రైతులు ఆశిస్తుండగా.. ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించుకుంటున్నారని ఆరోపించారు.

విద్యుత్ సమస్యతోనే చెట్టు కొమ్మలు తొలగించాం

శంకరపట్నం: తరచూ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్లు కొట్టేస్తుండడంతో విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్టు కొమ్మలు కొట్టేశామని ఆముదాపల్లి రైతులు పోలీసులకు పత్రం అందించారు. చెట్టు కొమ్మలు కొట్టేశారని ట్రాన్స్‌కో ఏఈ కుమారస్వామిపై కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఏఈకి ప్రమేయం లేదంటూ జంపయ్య, సదాశివారెడ్డి, రాజిరెడ్డి, గట్టయ్యతోపాటు 30 మంది రైతులు పోలీస్‌స్టేషన్‌లో పత్రం అందించారు. చెట్టు కొమ్మలు కొట్టిన నుంచి సరాఫరా సక్రమంగా జరుగుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరగంటి రవి శనివారం తెలిపారు. విలాసాగర్ గ్రామానికి చెందిన గరిగంటి అశోక్ అనే వ్యక్తి మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక అక్రమంగా తరలిస్తుండగా.. పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వ్యక్తిపై కేసు

జమ్మికుంట: అజాగ్రత్తగా బైక్ నడిపి ఇద్దరి గాయాలకు కారణమైన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరగంటి రవి శనివారం తెలిపారు. మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామానికి చెందిన ఎలిగేటి సంపత్, శరత్ అనే ఇద్దరు ఈనెల 19న బైక్‌పై వస్తుండగా.. పట్టణంలో పాత రిలయన్స్ పెంట్రోల్ బంక్ సమీపంలో తనుగుల గ్రామానికి చెందిన జీలుక తిరుపతి అనే వ్యక్తి అజాగ్రత్తగా బైక్ నడుపుతూ ఢీకొట్టాడు. సంపత్, శరత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం బాధితుడి తండ్రి ఎలిగేటి మధునయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని ఖాసీంపేట గ్రామ శివారులో శనివారం 83.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుబడినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వ్యాన్‌లో బియ్యం తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, అనంతరం సంబంధిత వాహనంతో పాటు రైస్‌ను సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించడం జరిగిందన్నారు. రాజు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌ను నియమించాలి

చొప్పదండి: రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర లెదర్ ఇండస్ట్రీ కార్పొరేషన్ చైర్మన్ నియామకం చేపట్టాలని చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతమ్‌కు వినతిపత్రం అందించారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో లెదర్ ఇండస్ట్రియల్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్తూరి రమేశ్ ఆధ్వర్యంలో ప్రీతమ్‌కు సన్మానం చేశారు. లిడ్‌క్యాప్ చైర్మన్ నియామకం చేసి లిడ్‌క్యాప్ కేటాయించిన భూములను కాపాడాలని, చర్మకారులకు ఉపాధి చూపించాలని విన్నవించారు. ఆయన వెంట పలువురు చర్మకారులు ఉన్నారు.

కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

శంకరపట్నం: కరీంపేట గ్రామంలో వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. మరమ్మతులు చేయించేందుకు రైతులు స్వయంగా ట్రాక్టర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్తున్నారు.

ముందస్తు హోలీ వేడుకలు

చొప్పదండి: హోలీ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పాఠశాలల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రంగులు పూసుకుంటూ కేరింతలతో హోరెత్తించారు. ఉపాధ్యాయులు కూడా ఆడారు.



వైభవంగా డోలోత్సవం

రామడుగు: వెలిచాల గ్రామ శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిత్య హోమం, బలిహరణం, తీర్థప్రసాదగోష్టి, డోలోత్సవం, ఎడ్లుల బండ్లు తిరిగే వేడుకలను వేద పండితులు సౌమిత్రి రామానుజాచార్యులు, మైత్రి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచులు వీర్ల సరోజన, వీర్ల రవీందర్‌రావు, మహిళలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి యాగశాల ప్రవేశం



జమ్మికుంట: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని కుంబాభిషేకం మహోత్సవల్లో భాగంగా స్వామివారు శనివారం యాగశాల ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. వేద పండితుడు బ్రహ్మశ్రీ వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, గణపతి పూజ, వేద స్వస్తి, గురువందనం, వాస్తు పూజ, అగ్నిమథనం చేసి హోమగుండం జ్వలింపచేశారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు దంపతులు స్వామి వారికి సారెతో స్వాగతం పలికారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిమల్ల జయేందర్, ఎ.రాజేంద్రప్రసాద్, జగదీశ్వర్, మామిడాల మనోహర్, ఒల్లాల దామోదర్, గర్రెపల్లి శివ, రావుల శ్రీను, మురళి, వీర్రాజు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

గర్భిణులు మంచి ఆహారం తీసుకోవాలి



రామడుగు: కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి



చొక్కారావుపల్లెలో..

రామడుగు: గర్భిణులు మంచి ఆహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను జరిపారు. ఎంపీడీవో రాజేశ్వరి, గంగాధర ప్రాజెక్టు అధికారి కస్తూరి, ఏసీడీపీవో సౌందర్య, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రశాంతి, సూపర్‌వైజర్ సుధారాణి, మండల వైద్యాధికారి రమేశ్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

గన్నేరువరం: చొక్కారావుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇశ్రత్ సుల్తానా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 సంవత్సరాల్లోపు పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ శారద, తల్లులు రేణుక, మంజుల, స్రవంతి, మౌనిక, రాజవ్వ పాల్గొన్నారు.



మానకొండూర్: సీమంతం నిర్వహిస్తున్న సీడీపీవో సబిత

మానకొండూర్: గర్భిణులు పౌష్టికమైన ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీవో సబిత అన్నారు. కొండపలకలలో శనివారం అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్, పోషణ్ పక్వాడా కార్యక్రమాలను నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, పిల్లలకు అక్షరాభ్యాసం చేపట్టారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అరుణ, టీచర్లు సుజాత, లక్ష్మిప్రసన్న, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగాధర: పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డలతో పాటు బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక సూచించారు. తాడిజర్రి, లక్ష్మిదేవిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. టీచర్లు జలజ, శంకరమ్మ, శోభ, కాంత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు మెరుగైన పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో తిరుమల సూచించారు. కందుగుల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ పక్వాడా ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ ఇరుసం నాగరాజు, అంగన్వాడీ టీచర్లు రాధ, పద్మ, రజిత, స్వరూప, సుభద్ర, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

మొగిలిపాలెంలో శ్రీరాజరాజేశ్వర కల్యాణం



తిమ్మాపూర్: మొగిలిపాలెంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివాలయంలో శనివారం శ్రీరాజరాజేశ్వరస్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు సంపత్‌కుమార్, చంద్రమోహన్‌శర్మ స్వామి వార్లకు నూతన వస్త్రాలంకరణ చేసి కన్నుల పండువగా కల్యాణం జరిపించారు. వేడుకలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిపించారు. ముందుగా గ్రామానికి చెందిన జాజాల మోహన్‌రావు దంపతులు వేములవాడ దేవస్థానం నుంచి స్వామివారి కల్యాణం కోసం ప్రత్యేకంగా తలంబ్రాలు, పట్టువస్త్రాలు తెప్పించారు. 12 సంవత్సరాలుగా వేములవాడ నుంచి ప్రత్యేకంగా తీసుకొస్తున్నారు. ఎంపీటీసీ పాశం తిలక్‌ప్రియారెడ్డి, మాజీ సర్పంచ్ మోరపల్లి సుష్మితరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కొమురయ్య, నారదాసు రాజేశ్వరరావు, ఆగమరావు, భూమారావు, మోరపల్లి రమణారెడ్డి, పాశం అశోక్‌రెడ్డి, సృజన్‌రెడ్డి, సాయిల్ల తిరుపతి, పెట్టం కిరణ్, సతీష్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు సన్మానం



తిమ్మాపూర్: మహాత్మానగర్ శ్రీఆండాళ్, పద్మావతి, శ్రీవేంకటేశ్వరస్వామి 45వ వార్షిక బ్రహ్మోత్సవాలు పది రోజులుగా అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీగోవర్ధన వెంకటాచార్యులు, శ్రీకంఠశేషాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల బ్రహ్మోత్సవాలు ముగియడంతో ఆలయ కమిటీ కార్యదర్శి ఒంటెల రవీందర్‌రెడ్డి, గంగారపు రమేశ్ ఆధ్వర్యంలో అర్చకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అర్చకులను అభినందించారు.

సీఎంను కలిసిన రెడ్డి సంఘం నాయకులు



రేవంత్‌రెడ్డితో నాయకులు

వీణవంక: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, ఉపాధ్యక్షుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు నల్ల కొండాల్‌రెడ్డి, పెద్ది లక్ష్మిమల్లారెడ్డి, చింతిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు నివాళి

రామడుగు: గోపాల్‌రావుపేట జాతీయ జెండా వేదిక వద్ద శనివారం షహీద్ దివస్ కార్యక్రమం ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజగురు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. చొప్పదండి మాజీ సర్పంచ్ గుంటి మల్లయ్య, జిల్లా ధర్మజాగరణ సమితి సభ్యుడు ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, నాయకులు పోచయ్య, కాసారపు పర్శారాంగౌడ్, గడ్డం రత్నాకర్, దాసరి అనిల్, బుర్ర సాయిలుగౌడ్, పాకాల రాములుగౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ధర్మజాగరణ సభ్యులు

హుజూరాబాద్: పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు కేశబోయిన రాముయాదవ్, దొమ్మటి వేణుగోపాల్, శివమణి, అరుణ్‌కుమార్, దేవేందర్ తదితరులున్నారు.



హుజూరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మస్టర్లలో తప్పులు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీధర్

తిమ్మాపూర్: ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్డీవో శ్రీధర్ హాజరై తనిఖీ నివేదికలు పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పని ప్రదేశంలో మస్టర్లు ఉండేలా చర్యలు తీసుకుంటూ తప్పులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పని చేసిన ప్రతీ కూలీకి పని కల్పించాలని అన్నారు. అడిషనల్ ఏడీఆర్డీవో సంధ్యారాణి, విజిలెన్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అంబుడ్స్‌మన్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్‌కుమార్, ఇన్‌చార్జి ఏపీవో రాజు, సామాజిక తనిఖీ స్టేట్ రిసోర్స్‌పర్సన్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, డీఆర్పీలు పాల్గొన్నారు.

రూ.7,833 రికవరీకి ఆదేశం

సామాజిక తనిఖీ బృందం వారు 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 2 వరకు జరిగిన రూ.3.26కోట్ల పనుల వివరాలు తనిఖీ చేయగా.. రూ.7,833ను సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్ ఈసీల నుంచి రికవరీ చేసేందుకు డీఆర్డీవో ఆదేశించారు. క్రీడా ప్రాంగణంలో అదనంగా చేసిన రూ.44,576 తదుపరి పేమెంట్ నుంచి తగ్గించి పనులు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు.

26న సామాజిక తనిఖీ

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ కార్యక్రమం ఈనెల 26న ఉదయం 10.30 గంటలకు జరగనున్నట్లు ఎంపీడీవో తూర్పాటి సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెలకు సంబంధించిన ఈజీఎస్ పనులపై తనిఖీ ఉంటుందన్నారు.

సహకార సంఘాలతోనే రైతు సంక్షేమం



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి

సైదాపూర్: వ్యవసాయ సహకార సంఘాలతోనే ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు అమలవుతున్నాయని వెన్నంపల్లి పీఏసీఎస్ చైర్మన్ బిల్లా వెంకటరెడ్డి అన్నారు. శనివారం కార్యాలయ ఆవరణలో సహకార సంఘం వార్షిక సభ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. రూ.2లక్షల రైతు రుణమాఫీ త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొని చేస్తుందన్నారు. కర్షక మిత్ర కార్యక్రమంలో ఎల్టీ లోన్లు ఎకరానికి రూ.2లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎవరైనా అవసరమున్న రైతులు బావులు తవ్వడానికి గానీ, పైపులైన్లకు త్వరగా దరఖాస్తులు చేసుకుంటే మార్చి లోపు రుణాలు ఇస్తామన్నారు. నూతనంగా నిర్మించిన కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. ఈ ఏడాది కరువుతో పంటలు నష్టపోతున్నామని, వచ్చే దిగుబడి తక్కువుంటుందని, తాలు పేరిట కోతలు లేకుండా చూడాలని మాజీ ఎంపీపీ బీస వెంకటయ్య సూచించారు. సీఈవో మల్లారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ మెప్మా సిబ్బంది ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. మెప్మా డీఎంసీ శ్రీవాణి, సీఎల్ఆర్‌పీ రమాదేవి, అనూష పాల్గొన్నారు.

టీబీపై..

ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వైద్యారోగ్య శాఖ సిబ్బంది పట్టణంలో టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చందునాయక్ మాట్లాడుతూ.. ప్రజల్లో ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉండి బరువు తగ్గుతూ ఉంటే తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. చెల్పూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మధుకర్, సీహెచ్‌వో సాజిద్, సిబ్బంది కిరణ్‌రెడ్డి, శశాంత్ తదితరులున్నారు.

బొమ్మకల్‌లో పోలీస్ కవాతు

సైదాపూర్: బొమ్మకల్‌లో శనివారం కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యల్లో భాగంగా ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని గ్రామస్తులకు హుజూరాబాద్ రూరల్ సీఐ పి.వెంకట్ అవగాహన కల్పించారు. సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

హుజూరాబాద్‌రూరల్: మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ హనుమకుమార్ తెలిపారు. శనివారం సింగాపూర్ గ్రామంలోని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల వేషధారణలో వచ్చి నృత్య ప్రదర్శన చేశారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీ.. ఇద్దరికి గాయాలు



ధ్వంసమైన కారు

మానకొండూర్: గట్టుదుద్దెనపల్లి గ్రామంలోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. కమలాపూర్ మండలం ఉప్పల్‌కు చెందిన సుమన్(28), రామకృష్ణ(27) కరీంనగర్‌లోని మహేంద్ర, మారుతి షో రూంలో పనులు ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలోని గట్టుదుద్దెనపల్లి వద్ద కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా.. ఇద్దరు యువకుల కాళ్లకు తీవ్ర గాయాలై రక్తస్రావం జరిగింది. వెంటనే వీరిని 108 వాహనం ద్వారా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి భజన పోటీల్లో ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న చొప్పదండి భజన మండలి సభ్యులు

చొప్పదండి: పట్టణంలోని హనుమాన్ భజన మండలి రాష్ట్రస్థాయి భజన పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. కేశవపట్నంలో గాజుల నందన్ స్మారక రాష్ట్రస్థాయి పోటీల్లో 32 భజన బృందాలు పాల్గొనగా.. చొప్పదండిలోని భజన మండలి ప్రథమ స్థానం సొంతం చేసుకొంది. శివకేశవ భజన మండలి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి విజేతగా నిలిచిన బృందానికి రూ.16వేల నగదు బహుమతి అందించారు. వ్యక్తిగత విభాగంలో చొప్పదండికి చెందిన చీకట్ల లచ్చయ్య ఉత్తమ గాయకుడిగా ఎంపికకాగా.. రూ.10వేల నగదు బహుమతి అందించారు. పిట్టల రఘుమోహన్, దండె కొమురయ్య, పూదరి రాములు, బత్తుల రవి, చిలుకనూరి లక్ష్మిరాజం, మొలుమూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుల ఉదారత

వీణవంక: కృష్ణంపేట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బొద్దుల సత్యనారాయణ ఇటీవల అకాల మరణం చెందగా.. మండల ఆదిత్య సేవాభ్యుదయ ఆర్ఎంపీ గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.26,500 ఆర్థిక సాయం శనివారం అందించారు. వారి కుటుంబానికి భరోసా కల్పించి సంతాపం తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న మాధవ్, నరసింహారాజు, జోనల్ ఎథిక్స్ కమిటీ చైర్మన్ కంకణాల ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, గోపు రాజేశ్‌బాబు, సమ్మయ్య, కొక్కుల సమ్మయ్య, మేక శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



రాజశేఖర్

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న కట్ల రాజశేఖర్ డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఈశ్వరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూలో ప్రొఫెసర్ జె.లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ ఆఫ్ స్ట్రక్చరల్ మాగ్నెటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆఫ్ రేర్ ఎర్త్ డోప్డ్ నికెల్ కాపర్ నానో ఫెరైట్స్ అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. ప్రఖ్యాతమైన అంతర్జాతీయ స్థాయిలోని జర్నర్స్‌ని నాలుగు పరిశోధన పత్రాలను ప్రచురించారు. రాజశేఖర్‌కు పీహెచ్ పట్టా ప్రదానం చేసినట్లు ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ సీపీ వర్ధిని తెలిపారు. కళాశాల హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ వి.రాజేశ్వర్‌రావు, డైరెక్టర్ కె.శంకర్, కళాశాల సెక్రటరీ సతీశకుమార్ శుభాకాంక్షలు తెలిపారు.